


# కడప మనస్సాక్షి

తెలుగు దినపత్రిక

PRGI Reg.No: APTEL/26/A0309

KADAPA MANASSAKSHI - Telugu Daily





వైయస్ఆర్ కడప/అన్నమయ్య | ఎడిటర్: వసంత శ్రీనివాసుల రెడ్డి | సంపుటి: 01 సంచిక: 239 | బుధవారం, 02 సెప్టెంబర్ 2026 | పేజీలు: 4 వెల.రూ.2/-


## మహిళలకు మరో శుభవార్త.. ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

**-త్వరలోనే అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు**



అమరావతి, సెప్టెంబరు 1: రాష్ట్రంలోని మహిళలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో శుభవార్త ప్రకటించారు. ప్రస్తుతం అమలవుతున్న స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని త్వరలో ఏసీ బస్సుల్లోనూ అమలు చేయనున్నట్లు వెల్లడించారు. మొగల్తూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఈ విషయాన్ని ప్రకటించారు. ? మహిళల ఆర్థిక సాధికారత, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ప్రస్తుతం స్త్రీశక్తి పథకం కింద మహిళలకు పలు రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుతోంది. త్వరలో రాష్ట్రానికి పెద్ద సంఖ్యలో ఏసీ బస్సులు అందుబాటులోకి రానున్నాయని, వాటిలోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. దీంతో సాధారణ బస్సులతో పాటు ఏసీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి రానుంది. స్త్రీశక్తి పథకం ప్రారంభమైన ఏడాది కాలంలో మహిళల నుంచి మంచి స్పందన లభించిందని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, నగర సాధారణ బస్సుల్లో ఈ పథకం అమలవుతోంది. ఏసీ బస్సుల్లోనూ ఈ సౌకర్యం అమలైతే మహిళలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది.









## మారుతున్న పవన్ లెక్కలు.. యువతపై జనసేనాని గురి!

**-పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి.. 2029 ఎన్నికలే లక్ష్యంగా కొత్త వ్యూహం**



అమరావతి, సెప్టెంబరు 1: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మారుతున్న సమీకరణాల నేపథ్యంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కొత్త వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. 2029 ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పార్టీకి కొత్త కమిటీల ఏర్పాటు ప్రక్రియను తుది దశకు తీసుకొచ్చారు. యువతను పార్టీ వైపు ఆకర్షించడంపై పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా సెప్టెంబరు 2న పిఠాపురంలో జనసేన యువజన విభాగాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం కేరళలో చికిత్స పొందుతున్న పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమంలో అంతర్జాలం ద్వారా పాల్గొని యువతలో రాజకీయ చైతన్యం, పార్టీ లక్ష్యాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 175 నియోజకవర్గాల్లో జనసేన యువజన విభాగం కార్యక్రమాలను విస్తరించేందుకు ప్రణాళిక రూపొందించారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు పార్టీ నాయకత్వం సన్నాహాలు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తూనే, రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సంస్థాగతంగా బలోపేతం చేయడమే పవన్ లక్ష్యంగా కనిపిస్తోంది. పెరుగుతున్న యువ ఓటర్ల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని వారిని పార్టీతో అనుసంధానం చేసే ప్రయత్నాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి టీటీడీ శుభవార్త

**-స్మార్ట్ గుర్తింపు కార్డులతో పలు ప్రయోజనాలు.. మూడు నెలలకోసారి శ్రీవారి దర్శనం**



తిరుమల, సెప్టెంబరు 1: తిరుమల తిరుపతి దేవస్థానాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సిబ్బందికి స్మార్ట్ గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు టీటీడీ కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. క్రమబద్ధీకరించిన ఉద్యోగుల తరహాలో స్మార్ట్ కార్డులపై సంకేత గుర్తింపు కోడ్‌ను ముద్రించి అందించనున్నారు. ఈ స్మార్ట్ కార్డు ద్వారా ప్రతి నెలా రాయితీ ధరకు రూ.20 చొప్పున 10 లడ్డూలను పొందే అవకాశం కల్పించారు. అలాగే ప్రతి మూడు నెలలకోసారి సుపథం మార్గం ద్వారా శ్రీవారి దర్శనం చేసుకునే సదుపాయం కల్పించనున్నారు. సిబ్బంది విధుల ఆధారంగా వివిధ రంగుల్లో సంకేత గుర్తింపు కోడ్‌తో కార్డులను జారీ చేయనున్నారు. టీటీడీ ఉద్యోగుల సమగ్ర సమాచారాన్ని రేడియో తరంగాల ఆధారిత గుర్తింపు పరిజ్ఞానం ద్వారా ఇప్పటికే స్మార్ట్ కార్డుల్లో పొందుపరిచినట్లు అధికారులు తెలిపారు. పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు కూడా స్మార్ట్ కార్డులను అందించినట్లు వెల్లడించారు. టీటీడీ కార్యాలయాల్లోకి ప్రవేశం, ఆలయాల్లో దర్శనం, ప్రతి నెలా లడ్డూలు పొందడం, క్యాలెండర్, పంచాంగం పొందడం, వైద్య సదుపాయాలు వంటి పలు సేవలను ఈ స్మార్ట్ కార్డు ద్వారా పొందే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఈ నిర్ణయం ద్వారా గుర్తింపుతో పాటు పలు ప్రయోజనాలు అందనున్నాయి.

## సెప్టెంబరు 5న నిరసన మార్చ్ రద్దు

**-కేంద్రం హామీలతో వెనక్కి తగ్గిన సీజేపీ.. సుప్రీంకోర్టులో కీలక పరిణామం**



న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: సెప్టెంబరు 5న ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన నిరసన మార్చ్‌ను కాక్రోచ్ జనతా పార్టీ రద్దు చేసింది. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించడంతో పాటు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ వెల్లడించారు. జూలై 20న ఢిల్లీలో నిర్వహించిన నిరసనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. కేంద్రం నుంచి తగిన స్పందన రాకపోవడంతో సెప్టెంబరు 5న ఇండియా గేట్ నుంచి మరో నిరసనకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించి విద్యార్థులపై నమోదైన కేసుల రద్దుకు చర్యలు చేపట్టింది. కేంద్రం హామీలను సీజేపీ సుప్రీంకోర్టుకు తెలియజేయడంతో నిరసన మార్చ్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. ఇరుపక్షాలు సత్సంబంధాలతో వ్యవహరిస్తే సమస్యలను పరిష్కరించుకోవచ్చని న్యాయస్థానం సూచించింది. మరోవైపు నీట్ పరీక్షల నిరసనల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించే అంశంపై మూడు నెలల్లో మార్గదర్శకాలు రూపొందిస్తామని కేంద్రం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చినట్లు సమాచారం. దీంతో సెప్టెంబరు 5న నిర్వహించాల్సిన నిరసనకు సీజేపీ తెరదించింది.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily

# నిర్లక్ష్యం వద్దు.. ప్రాణం అమూల్యం

**-విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించిన పోలీసులు**



రాయచోటి, (మనస్సాక్షి): జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాల మేరకు రాయచోటిలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి విద్యార్థులకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల సంభవించే ఘోర రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వీడియోలను విద్యార్థులకు ప్రదర్శించి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. నేటి యువత బాధ్యతాయుతంగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితమైన ప్రయాణం చేయాలని పోలీసు అధికారులు సూచించారు.

# 'పల్లె నిద్ర'తో గ్రామాల్లో పోలీసుల భద్రతా చర్యలు

**-స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు**



అన్నమయ్య జిల్లా, (మనస్సాక్షి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడే లక్ష్యంతో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పోలీసులు 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా పోలీసులు రాత్రి వేళల్లో గ్రామాల్లోనే బస చేస్తూ ప్రజలకు మరింత చేరువవుతున్నారు. మహిళల భద్రత, బాల్య వివాహాల నిరోధం, సైబర్ నేరాలు, దొంగతనాల నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నికల వాతావరణాన్ని దెబ్బతీసే అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా లేదా కొత్త వ్యక్తులు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# పులివెందులలో జనసేన రక్తదాన శిబిరం



లింగాల, (మనస్సాక్షి): జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందులలోని వైద్య కళాశాలలో జనసేన పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు లింగాల మండల ఇన్‌చార్జ్ దాసరి నారాయణస్వామి తెలిపారు. పవన్ కళ్యాణ్‌పై ఉన్న అభిమానంతో ఆయన జన్మదినోత్సవం సందర్భంగా రక్తదానం చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పులివెందులలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో బైక్ ర్యాలీ, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దాసరి నారాయణస్వామి తెలిపారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం రక్తదానం చేసిన జనసేన నేత గోసుల ఆంజనేయులు




పులివెందుల, (మనస్సాక్షి): జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందులలోని వైద్య కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జనసేన పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ హరీష్, హితేష్ రాయల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో జనసేన నేత గోసుల ఆంజనేయులు రక్తదానం చేశారు. పవన్ కళ్యాణ్‌పై ఉన్న అభిమానంతో ఆయన జన్మదినోత్సవం సందర్భంగా రక్తదానం చేసినట్లు ఆంజనేయులు తెలిపారు. సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పులివెందులలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

# తెలుగుదేశంలో సమర్థవంతమైన బీసీ నేత జి.శంకర్ యాదవ్

**- పొన్నీటిపాళ్యం పంచాయతీ టిడిపి ఇంఛార్జి బీదం గురునాథ్ యాదవ్**



మదనపల్లె (మనస్సాక్షి) : తెలుగుదేశం పార్టీ తంబళ్లపల్లి ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ ప్రజల అభిమానం చూరగొన్న నాయకుడని మదనపల్లె మండలం,పొన్నీటిపాళ్యం పంచాయతీ టిడిపి ఇంచార్జి బీదం గురునాథ్ యాదవ్ ప్రశంసించారు.శంకర్ యాదవ్ చిప్పిలికి విచ్చేసిన సందర్భంగా గురునాథ్ యాదవ్ పుష్పగుచ్ఛం అందజేసి,శాలువాతో ఘనంగా సన్మానించారు.ప్రస్తుత రాజకీయాలపై ఇరువురు కాసేపు చర్చించుకున్నారు.ఈ సందర్భంగా గురునాథ్ యాదవ్ మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకు ఎమ్మెల్యేగా తంబళ్లపల్లి నియోజకవర్గాని జి.శంకర్ యాదవ్ గణనీయమైన అభివృద్ధి చేసి తనదైన ముద్రవేశారని కొనియాడారు.కరువు ప్రాంతమైన తంబళ్లపల్లిని సస్యశ్యామలం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.ఆయన సామర్థ్యాని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి నియోజకవర్గం పగ్గాలు అప్పగించడం శుభపరిణామమన్నారు. ఆయన సారథ్యంలో తంబళ్లపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రపథాన నిలవాలని ఆకాంక్షించారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బలమైన బీసీ నేతగా ఎదగడం గర్వకారణామన్నారు.ఆయనతో తనది ప్రత్యేక అనుబంధమని,జి.శంకర్ యాదవ్,మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషాలు ప్రజాబలం ఉన్న నాయకులని వెల్లడించారు.

# మిట్స్ యూనివర్సిటీలో ఘనంగా పేరెంట్స్--టీచర్స్ సమావేశం

**-స్కాలర్‌షిప్‌లు, అంతర్జాతీయ అవకాశాలపై తల్లిదండ్రులకు అవగాహన**



మదనపల్లె, సెప్టెంబర్ 1 (మనస్సాక్షి): మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థుల తల్లిదండ్రులతో పేరెంట్స్--టీచర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రామనాథన్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం వంటి ఆధునిక సాంకేతిక రంగాలు ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఈ రంగాల్లో దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ స్కాలర్‌షిప్‌లు, ప్రతిభ ఆధారిత ఆర్థిక సహాయ పథకాలు, ఉన్నత విద్యా అవకాశాలను వివరించారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఆయా దేశాల్లోని విశ్వవిద్యాలయాలు, కోర్సులు, ప్రవేశ అర్హతలు, స్కాలర్‌షిప్ అవకాశాలపై ముందుగానే అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ విద్యా లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని భవిష్యత్ కెరీర్‌కు అవసరమైన నైపుణ్యాలపై దృష్టి సారించాలని అన్నారు. తల్లిదండ్రులు తరచుగా విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం ద్వారా తమ పిల్లల చదువు, హాజరు, క్రమశిక్షణ, ప్రవర్తన, నైపుణ్యాభివృద్ధిపై అధ్యాపకులతో నేరుగా తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు విద్యార్థులు--తల్లిదండ్రుల సంబంధాల విభాగం ద్వారా అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, అధ్యాపకులు, విశ్వవిద్యాలయ యాజమాన్యం పరస్పర సహకారంతో పనిచేయడం అవసరమన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎస్. పద్మ, అంతర్జాతీయ సంబంధాల సహాయ సంచాలకురాలు యు. విజయలక్ష్మి, విద్యార్థుల వ్యవహారాల సీనియర్ మేనేజర్ డాక్టర్ అథాహర్ సమీనా ఖాన్, విద్యార్థులు--తల్లిదండ్రుల సంబంధాల విభాగం మేనేజర్ రియాజ్ అలీ, కార్యక్రమ సమన్వయకర్త ఉషా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# "అవికా" సాఫ్ట్‌బాల్‌లో కేక

**-అండర్--15 సాఫ్ట్‌బాల్ ఆసియా కప్‌కు మంగంపేట బిడ్డ**


కడప జిల్లా, సెప్టెంబర్ 1 (మనస్సాక్షి): గ్రామీణ ప్రాంతం నుంచి క్రీడల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయికి ఎదగవచ్చని మంగంపేటకు చెందిన లావులూరి అవికా రాయ్ మరోసారి నిరూపించింది. చైనాలో అక్టోబర్ 12 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న 8వ అండర్--15 సాఫ్ట్‌బాల్ ఆసియా కప్ పోటీల్లో భారత జట్టు తరపున పాల్గొనేందుకు అవికా రాయ్ ఎంపికైంది. ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రోత్సాహం, కడప జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సహకారంతో అవికా ఈ ఘనత సాధించింది. మంగంపేట ఏపీఎండీసీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న అవికా ఇటీవల మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి ఆసియా కప్‌లో పాల్గొనే భారత జట్టులో స్థానం సంపాదించింది. భారత సాఫ్ట్‌బాల్ సంఘం నుంచి అధికారిక ప్రకటన వెలువడటంతో అవికా తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, కోచ్‌లు, క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింత కష్టపడి సాధన చేసి భారత జట్టుకు మంచి పేరు తీసుకువస్తానని అవికా రాయ్ తెలిపింది. సాఫ్ట్‌బాల్‌పై తన ఆసక్తిని గుర్తించి క్రీడలో శిక్షణ అందించిన కోచ్ అబ్దుల్ కరీం, ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కూన రవికుమార్, కార్యదర్శి సుర శ్రీనివాసరావు, కన్వీనర్ రమణ, కడప జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులకు అవికా తండ్రి చరణ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని కడప జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మరింత మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అవికా రాయ్ భారత జట్టుకు ఎంపిక కావడం ఉమ్మడి కడప జిల్లాకు గర్వకారణమని ఆయన అన్నారు.

# కూటమి అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే కూటమి

**-టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి**

సిద్ధవటం (మనస్సాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం అవ్వ తాతలకు ప్రతినెల 1 తేదీన ప్రభుత్వ ఉద్యోగులచే పెన్షన్ పంపిణీ చేపట్టడం అవ్వ తాతల ముఖంలో చిరునవ్వు కనబడుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు, శనివారపు మోహన్ రెడ్డి తెలిపారు మండలంలోని జ్యోతి గ్రామంలో మంగళవారం పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పెన్షన్ పంపిణీ చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి, గొడ్డలి పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కనుమరుగై పోతుందని ఐదేళ్ల వైసిపి పార్టీ అధికారం అడ్డం పెట్టుకుని రెవెన్యూ భూములు దోచుకున్నారని వైసిపి మాజీ మంత్రి జోగి రమేష్ కోట్ల విలువైన భూములు కబ్జా చేశారని ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తూ ఉండడంతో వైసీపీ నేతలకు మింగుడ పడడం లేదని జోగి రమేష్ భూకజ్జాలపై రాష్ట్రంలో కలకలం రేగిందని, ఆయన మండిపడ్డారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తూ ఉంటే ఓర్వలేక బురద చల్లుతున్నారని రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని తెలిపారు

# ప్రొద్దుటూరు అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక



కడప, (మనస్సాక్షి): ప్రొద్దుటూరు పట్టణం, పరిసర గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో రహదారులు, భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సుమారు రూ.600 కోట్లతో భూగర్భ డ్రైనేజీ, 24 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. పేదల గృహ నిర్మాణంపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని, అర్హులైన పేదలకు గృహ నిర్మాణ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలను పట్టణంతో అనుసంధానించే రహదారుల అభివృద్ధితో పాటు పరిశ్రమలు, ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జేసీ డా. నిధిమీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily
బుధవారం, 02 సెప్టెంబర్ 2026

# ప్రభుత్వ సేవల్లో సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకం

**-సమాచార శాఖ జోన్-4 ఆర్జేడీ ఎం.వెంకటేశ్వర ప్రసాద్**



కడప, సెప్టెంబరు 1 (మనస్సాక్షి): అక్షరాస్యత పెంపు, పేదరిక నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను ప్రజలకు చేరవేయడంలో సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకమని జోన్-4 ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు ఎం.వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మంగళవారం కడపలోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలోని పరిపాలనా అంశాలను పరిశీలించి, శాఖాపరంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, సిబ్బంది విధులపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో సమావేశమై వారి విధులు, బాధ్యతలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో సమాచార శాఖ మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. అక్షరాస్యత, పేదరిక నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, వాటి ప్రయోజనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాలు సమాచార వ్యాప్తికి కీలక వేదికలుగా మారాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ఆయా కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగేలా సమాచారాన్ని అందించాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. జోన్-4 పరిధిలో సమాచార శాఖను మరింత పటిష్టం చేయడంతో పాటు పాత్రికేయులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకుడు రమేష్, జిల్లా సమాచార విస్తరణ అధికారి శ్రీనివాసరావు, ప్రజా సంబంధాల అధికారి రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, సీనియర్ సహాయకుడు మహబూబ్ బాషా తదితరులు ఆర్జేడీ ఎం.వెంకటేశ్వర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సమాచార సాంకేతిక నిపుణులు, ఛాయాచిత్రకారులు, టైపిస్టులు, రికార్డు సహాయకులు, సాంకేతిక సహాయకులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# నైపుణ్యం పోర్టల్‌లో ప్రతి విద్యార్థి నమోదు తప్పనిసరి

మదనపల్లె, (మనస్సాక్షి): యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ఒకే వేదికపై అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'నైపుణ్యం' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని అన్నమయ్య జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి హెచ్. దొన్నప్ప తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత ప్రతి ఒక్కరూ నైపుణ్యం పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. పోర్టల్‌లో నమోదు ద్వారా విద్యార్హతలు, నైపుణ్యాలు, ధ్రువపత్రాలు, అనుభవం, ఉద్యోగ దరఖాస్తు వివరాలు, వృత్తి ప్రాధాన్యతలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా అభ్యర్థులకు అనుకూలమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, ఉద్యోగ మేళాలు, నియామక కార్యక్రమాలు, ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. నమోదు సమయంలో అభ్యర్థులు తమ ఆధార్ సంఖ్య, సెల్‌ఫోన్ నంబర్, ఈ-మెయిల్ వివరాలను ధ్రువీకరణ సంకేతం ద్వారా నిర్ధారించుకోవాలని సూచించారు. అనంతరం సంప్రదింపు చిరునామా, అత్యున్నత విద్యార్హత, నైపుణ్యాలు, అనుభవం, వృత్తి ఆకాంక్షలు, ఉద్యోగ దరఖాస్తు వివరాలను పూర్తిగా నమోదు చేయాలని తెలిపారు. తమ వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవడం ద్వారా అందుబాటులో ఉన్న శిక్షణ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు ముందుగా సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించి, ఉద్యోగ దరఖాస్తును రూపొందించుకునే విభాగాన్ని ఎంచుకోవాలి. అనంతరం పన్నెండు అంకెల ఆధార్ సంఖ్యను నమోదు చేసి ధ్రువీకరణ సంకేతం ద్వారా నిర్ధారించుకోవాలి. అభ్యర్థి వివరాలు, సెల్‌ఫోన్ నంబర్, ఈ-మెయిల్, సంప్రదింపు చిరునామా, అత్యున్నత విద్యార్హత, నైపుణ్యాలు, అనుభవం, వృత్తి ఆకాంక్షలు, ఉద్యోగ దరఖాస్తు వివరాలను పూర్తిగా నమోదు చేయాలి. అనంతరం ప్రభుత్వం అందించే వినియోగదారు పేరు, రహస్య సంకేతంతో పౌరుడిగా ప్రవేశించాలి. "నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవడం కేవలం నమోదు ప్రక్రియ మాత్రమే కాదు. యువత తమ భవిష్యత్ వృత్తి, ఉపాధి అవకాశాల వైపు వేసే ముఖ్యమైన అడుగు. ప్రతి విద్యార్థి, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని దొన్నప్ప తెలిపారు. మదనపల్లె నియోజకవర్గానికి 9553202509, 6301612761, తంబళ్లపల్లెకు 8897776368, 9741432931, రాయచోటికి 9550104260, 9177143181, పీలేరుకు 7799587687, పుంగనూరుకు 7780599208 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకుని శిక్షణ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి హెచ్. దొన్నప్ప కోరారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

**-నిద్రమత్తులో డ్రైవింగ్ చేయొద్దు.. అలసటగా ఉంటే విశ్రాంతి తీసుకోవాలి**



కడప, సెప్టెంబరు 1 (మనస్సాక్షి): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ప్రధాన రహదారులపై రాత్రివేళ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రధాన రహదారులపై ప్రయాణించే లారీలు, బస్సులు, కార్లు, వ్యాన్లను పోలీసులు ఆపి డ్రైవర్ల పరిస్థితిని పరిశీలిస్తున్నారు. నిద్రమత్తుగా ఉన్న డ్రైవర్లతో నీటితో ముఖం కడిగించి, కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాతే ప్రయాణాన్ని కొనసాగించేలా సూచిస్తున్నారు. నిద్రమత్తులో వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అలసటగా అనిపించినప్పుడు వాహనాన్ని సురక్షిత ప్రదేశంలో నిలిపి తగినంత విశ్రాంతి తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. డ్రైవర్ తన ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలను కూడా కాపాడే బాధ్యత కలిగి ఉంటారని తెలిపారు. "ఆపండి.. ముఖం కడుక్కోండి.. విశ్రాంతి తీసుకుని వెళ్లండి" అనే విధానాన్ని పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని కోరారు.

# కొర్రపాడు, కోడిగాండ్లపల్లెలో 'పొలం పిలుస్తోంది'




ముద్దనూరు (మనస్సాక్షి): మండలంలోని కొర్రపాడు, కోడిగాండ్లపల్లె గ్రామాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏడీఏ కె. రామమోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన అన్ని పంటలను రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పొలం కలిగి ఉన్న ప్రతి రైతు రైతు గుర్తింపు సంఖ్య పొందాలని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. పంట నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. అనంతరం అధికారులు గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న, ఉల్లి పంటలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించారు. సకాలంలో వర్షాలు లేక బోరు బావుల్లో నీటి మట్టం తగ్గిపోవడంతో పంటలకు సరిపడా నీరు అందడం లేదని రైతులు అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు అంజనమ్మ, శిరీషతో పాటు రైతులు కేశవ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, చెన్నకేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జానపద చెక్క భజన కళాకారులను ప్రోత్సహించడమే లలిత కళాభిరామ సంస్థ లక్ష్యం

**-లలిత కళాభిరామ కళారత్న అధ్యక్షుడు డాక్టర్ గొల్లపల్లి జయన్న**



కడప జిల్లా, సెప్టెంబర్ 1 మనస్సాక్షి: బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని చింతపుతాయపల్లె గ్రామంలో చెక్క భజన గురువు ఓబులేసు ఆధ్వర్యంలో చెక్క భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్క భజన గానకోకిల నాయనపల్లి గురువు ఓబులేసును ఘనంగా సన్మానించి నగదు బహుమతిని అందజేశారు. చెక్క భజన సామ్రాట్ పుల్లయ్య సతీమణి ఐవరమ్మను కూడా సత్కరించారు. జానపద కళాకారుల్లో ఉన్న గానం, నృత్య ప్రతిభ గ్రామీణ ప్రాంత ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటుందని, ఇలాంటి కళలను ప్రోత్సహించడమే లలిత కళాభిరామ సంస్థ ప్రధాన లక్ష్యమని సంస్థ కళారత్న అధ్యక్షుడు డాక్టర్ గొల్లపల్లి జయన్న తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో ఎంతోమంది సీనియర్ జానపద కళాకారులు ఉండటం మన అదృష్టమన్నారు. కార్యక్రమానికి హాజరైన 25 మంది చెక్క భజన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురువు గుడిమే సుదర్శన్, కందుల రవికుమార్, చీపాడు నరసింహులు, ఈశ్వర్ గౌడ్, ఓబిలి వెంకటసుబ్బయ్య, సావిశెట్టిపల్లి శేఖర్, గుడిసెనపల్లి బాల గురవయ్య, నాగసానిపల్లి వీరమోహన్, చితారి ఎల్లయ్య, ముళ్లపాటి ప్రసాద్‌రావు, మున్నెలి ప్రసాద్, వరికుంట్ల సాయికృష్ణతో పాటు కళాభిమానులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వము కూతల, కోతల, వాతల ప్రభుత్వం

**-డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.**



వేంపల్లి, సెప్టెంబర్:01 (మనస్సాక్షి): చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వము కూతల, కోతల, వాతల ప్రభుత్వంగా తయారైందని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి పాలనలో నిత్యావసర సరుకుల ధరలు నింగి నంటు తున్నాయి అన్నారు. "ఏమి కొనేటట్టు లేదు- ఏమి తినేటట్టు లేదు" అన్న పరిస్థితి దాపురించిందన్నారు. కాంగ్రెస్ పాలనలో జేబులో డబ్బులు వేసుకొని మార్కెట్ కు పోయి సంచిలో సరుకులు తెచ్చుకునే వారనీ,ప్రస్తుతం సంచిలో డబ్బులు వేసుకొని మార్కెట్ కి పోయి జేబులో సరుకులు తెచ్చుకునే దుస్థితి దాపురించిందన్నారు. గృహిణులు లు వంటగదిలోకి పోవాలంటే భయపడిపోతున్నారు. బియ్యము,కందిపప్పు, వంట నూనెలు, ఎండుమిరప, చింతపండు, చక్కెర ఇలా ప్రతి వస్తువు ధర ఈ ఏడాది కాలంలో 40 శాతం నుండి 70 శాతం వరకు పెరిగిందన్నారు. నిత్యావసర ధరలు తగ్గించేందుకు వెంటనే కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఒకవైపు విద్యుత్ చార్జీలు పెంచలేదంటూనే మరొకవైపు విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో 21,243 కోట్ల రూపాయల అదనపు భారము విద్యుత్ వినియోగదారుల మీద కూటమి ప్రభుత్వం మోపింది.కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్లో పెట్రోల్ డీజిల్ ధర లీటర్ మీద ఆరు రూపాయల నుంచి పది రూపాయలు వరకు ఎక్కువగా ఉంది.దీనికి కారణం ఆంధ్రప్రదేశ్లో వ్యాట్ శాతం ఎక్కువగా ఉండడం, అదనపు వ్యాట్,రోడ్ డెవలప్మెంట్ సెస్సు ఉండడం. వ్యాట్ శాతం తగ్గించాలని,అదనపు వ్యాట్,రోడ్డు డెవలప్మెంట్స్ ఉపసంహరించుకోవాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ మీద లీటర్ పై పెంచిన ఎనిమిది రూపాయలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎరువుల ధరలు ఒక్కొక్క 50 కేజీల బస్తాపై 500 రూపాయల నుంచి 800 రూపాయల వరకు పెరిగింది. ఎరువులు ధరలు తగ్గించాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ వేముల మండల శాఖ అధ్యక్షుడు చాగలేటి వెంకటేశు,చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,బద్రీనాథ్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్‌లో అన్నమయ్య జిల్లా క్రీడాకారుల సత్తా

**-పతక విజేతలను అభినందించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



మదనపల్లె, సెప్టెంబర్ 1 (మనస్సాక్షి): అమరావతి ఛాంపియన్‌షిప్--2026 రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో అన్నమయ్య జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్‌లో మోతుకూరి కళ్యాణి, కందుకూరి లక్ష్మీ సింధూర ద్వితీయ స్థానాలు సాధించి రజత పతకాలు కైవసం చేసుకోగా, బాక్సింగ్‌లో సిరివెలు నిఖిల్ దేవ్ నాయుడు ద్వితీయ స్థానం సాధించారు. అథ్లెటిక్స్‌లో జావెలిన్ త్రో విభాగంలో సుంకు గంగాధర్ ద్వితీయ స్థానం సాధించి రజత పతకాన్ని అందుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులు తమ విజయాలను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు తెలియజేసేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారులను అభినందించి వారి ప్రతిభను ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి అన్నమయ్య జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి చంద్రశేఖర్, క్రీడాకారులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మదనపల్లెలో బాలికల భద్రతపై అవగాహన సదస్సు

***-బాల్య వివాహాలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన శిక్షలు: జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి***



మదనపల్లె, సెప్టెంబర్ 1 (మనస్సాక్షి): మదనపల్లెలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 'బేటీ బచావో--బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నిషేధం, బాలికల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ బాల్య వివాహాలకు, మైనర్లపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. బాలికలు ఆపద సమయంలో 1098, 181, 112 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. తమ భద్రత కోసం ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ఎస్పీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హైమావతి, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ కుమార్, సీఐ మహమ్మద్ రఫీ, ఎస్బీ సీఐ యు. సదాశివయ్య తదితరులు పాల్గొన్నారు.

కడప మనస్సాక్షి
తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily















## ఘనంగా పులివెందుల లో

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వేడుకలు

**-జనసేన పార్టీ పులివెందుల ఇంచార్జ్ డాక్టర్.హరీష్, మరియు హితేష్ రాయల్, నియోజకవర్గ జనసైనికుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు**

**వేడుకలో భాగంగా రక్తదాన శిబిరం, బైక్ ర్యాలీ, కేక్ కట్టింగ్స్ మరియు జనసేన యువజన విభాగ ఆవిష్కరణ కార్యక్రమం**



పులివెందల,సెప్టెంబర్ 01 (మనస్సాక్షి): జనసేన అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా వైయస్సార్ కడప జిల్లా పులివెందుల లో నిన్న గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి విశేషా స్పందన లభించిందని జనసేన పార్టీ పులివెందుల ఇంచార్జ్ డాక్టర్.హరీష్ మరియు యువజన నాయకుడు హితేష్ రాయల్ తెలిపారు. తదనంతరం డాక్టర్ హరీష్ మాట్లాడుతూ,ఈ రక్తదాన శిబిరంలో అధిక సంఖ్య లో జనసైనికులు వీరామహిళలు పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొని రక్తదానం చేయడం జరిగింది అని తెలిపారు .తదుపరి 2/9/26 బుధవారం నాడు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పులివెందులలో బైక్ ర్యాలీ నిర్వహిస్తునట్లు, బైక్ ర్యాలీ అనంతరం జనసేన యువజన విభాగ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని. పవన్ కళ్యాణ్ అభిమానులు , జనసైనికులు, వీరామహిళలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ తెలిపారు, బైక్ ర్యాలీ కడప రోడ్ రాజారెడ్డి సర్కిల్ నుండి పాత బస్టాండ్ సర్కిల్ మీదగా పూలంగల్లు సర్కిల్ వరకు సాగుతుందని, తదనంతరం పవన్కళ్యాణ్ గారికి చేతులు మీదగా యువజన విభాగ ప్రారంబోచ్చవ కార్యక్రమ లైవ్ టెలికాస్ట్ వాజపేయి సర్కిల్ జరుగుతుందని అనంతరం కేక్ కటింగ్ జరుగుతుందని డాక్టర్. హరీష్ తెలిపారు.



# కడపలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**-భారీ బైక్ ర్యాలీ, ప్రత్యేక పూజలు, అన్నదానానికి ఏర్పాట్లు**



కడప, సెప్టెంబర్ 1 (మనస్సాక్షి): జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కడప నగరంలో ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కడప జిల్లా జనసేన నాయకులు జి.వి. రమణ, తుంగా రమణయ్య మీడియా సమావేశంలో వేడుకల వివరాలను వెల్లడించారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు పాత బస్టాండ్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పవన్ కళ్యాణ్ పేరున ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు మున్సిపల్ గ్రౌండ్‌లోని ఐఎంఏ హాల్ సందు వద్ద నుంచి వందలాది మంది జనసైనికులతో భారీ బైక్ ర్యాలీ ప్రారంభం కానుంది. ఈ ర్యాలీ అప్సరా సర్కిల్, వై జంక్షన్, కొత్త బస్టాండ్, నాగరాజుపేట, పాత బస్టాండ్, సెవెన్ రోడ్స్, గోకుల్ లాడ్జ్, కృష్ణ సర్కిల్, అన్నమయ్య సర్కిల్ మీదుగా తిరిగి ఐఎంఏ హాల్ సందుకు చేరుకుంటుంది. ర్యాలీ అనంతరం భారీ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. జనసేన యువజన విభాగం ఆవిష్కరణ సందర్భంగా పవన్ కళ్యాణ్ సందేశాన్ని వీక్షించేందుకు భారీ తెరలను ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమానికి హాజరయ్యే జనసైనికులు, వీరమహిళలు, అభిమానులందరికీ భోజన సదుపాయం కల్పించనున్నట్లు నాయకులు తెలిపారు. కడప నగరంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, యువత, వీరమహిళలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.




Editor, Printed, Published and Owned by VASANTHA SREENIVASULA REDDY, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 51600. RNI REG NO:- APTEL/26/A0309.
Printed at. VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. Editor: VASANTHA SREENIVASULA REDDY, E-mail: sreenu1167@gmail.com, Cell: +91 8341698284